


# పజిల్

**వాణిశ్రీ**

శనివారం సాయంకాలం నాకు హాలిడే మూడ్ వచ్చేస్తూ వుంటుంది. అది వారం కార్యక్రమాల గురించి ఆలోచిస్తూ వుంటాను. సాయంకాలం నాలుగు దాటింది. ఫైల్స్ మూసేసి ఐదు ఎప్పుడవుతుందా అని ఎదురుచూస్తున్నాను.

"సార్ మీకోసం ఎవరో వచ్చారు!" చెప్పాడు అటెండర్.

"ఇప్పుడు కాదు. సోమవారం రమ్మను." చిరాకుగా జవాబు చెప్పాను. ఆఫీసు టైము అయిపోతుండగా వచ్చి పట్టుకుంటారు పార్టీలు.

"ఆఫీసు పనిమీద వచ్చినట్లు లేదు సార్?"

"మరి?"

"ఎవరో ఆడమనిషి."

"రమ్మను."

అటెండర్ వెళ్ళిపోయాడు.

"నమస్తే."

"నమస్తే. కూర్చోండి."

ఆమె కూర్చుంది. ఆమె ఎవరో! ఎప్పుడూ చూసిన జ్ఞాపకం లేదు. పరీక్షగా చూశాను. పాతికేళ్ళు వుండొచ్చు. ఎత్తుగా వుంది. మంచి పర్సనాల్టీ. ఎర్రటి రంగు. బొద్దుగా, అందంగా, ఆకర్షణీయంగా వుంది. కళ్ళు విశాలంగా వున్నాయి. అయితే పిల్లికళ్ళు. ముఖాన బొట్టు లేదు. హిందూ కాకపోవచ్చు.

అప్పుడప్పుడూ నాకోసం ఇలా ఆడవాళ్ళు వచ్చి నన్ను కలుసుకుని వెళ్ళడం

మామూలే. నా కథలు, నవలలు చదివి కాంప్లిమెంట్స్ ఇచ్చిపోతుంటారు. ఈమె గూడా అదే బాపతు అని నా కనిపించింది.

"నా పేరు రాగిణి."

"వెరీ గ్లాడ్ టూ మీట్ యూ."

"నేను శాంసన్ అండ్ కంపెనీలో అడ్వర్‌టైజింగ్ సెక్షన్లో పనిచేస్తున్నాను, మిమ్మల్ని కలుసుకోవాలని చాలా రోజుల్నించి అనుకుంటున్నాను. కాని ఈ వేళ్టికి కుదిరింది."

రాగిణి నవ్వింది.

"మీ కథలు నాకు చాలా ఇష్టం."

"థాంక్స్."

నేను వాచీ వైపు చూశాను. ఐదు కావొచ్చింది. రాగిణి తొందరగా వెళ్ళిపోతే బాగుండునని అనిపిస్తోంది.

"మీ కథలు ఎందుకు వచ్చుతాయో చెప్పాలి. చాలా కథల్లో ప్రాబ్లమ్స్‌కి సొల్యూషన్ చూపిస్తారు మీరు."

ఇబ్బందిగా నవ్వాను.

"ఆఫీస్ టైమ్ కావొచ్చింది."

"అవును." అన్నాను.

"నేను వచ్చి మీ టైమ్ వేస్ట్‌చేయ్యడం లేదు గదా?"

"నో....నాటెటాల్."

"మీతో కొంచెం మాట్లాడాలి. రండి. కాఫీకి వెళ్దాం."

'అ మాట్లాడేది ఏదో ఇక్కడ మాట్లాడొచ్చుగదా!' అని మనసులో అనుకున్నాను. పైకి అనలేదు. ఆమె నొచ్చుకోవచ్చు.

ఇద్దరం కలిసి బయల్దేరాం.

అది ఏ.సి. రెస్టారెంట్

ఆమె టిఫిన్ ఆర్డర్ చేసింది.

"చెప్పండి." అన్నాను.

"నా కథకు మీరు సరైన పరిష్కారం చెప్పాలి. చాలా నమ్మకంతో వచ్చాను."

"నే నేదో చిన్న కథలు వ్రాస్తూ వుంటాను సరదాగా. ఐ యామ్ నాట్ ప్రొఫెషనల్ రైటర్. మీరు గొప్పగా వూహించుకోకండి."

"నా దృష్టిలో మీరు గొప్ప రైటరే. మీ కథల్లో అనుకోని మలుపులు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. మీకు అలాంటి ఐడియాలు ఎలా వస్తాయో నాకు చచ్చినా అర్థంకాదు."

"మీ ప్రాబ్లమ్ చెప్పండి."

"నాకు పెళ్ళయింది. ఒక పిల్లవాడు పుట్టాడు. వాడికి సంవత్సరం నిండగానే ఆయన యాక్సిడెంట్‌లో పోయారు. ఇప్పటికి పదమూడు సంవత్సరాలయింది"

నాకు ఆశ్చర్యం వేసింది. ఆమె వయసుగురించి. వుండబట్టలేక అడిగాను.

"మీ వయస్సెంత?"

"ముప్పై."

"అలా కన్పించరు."

ఆమె నవ్వింది.

"ఇన్నాళ్ళూ నేను యాంత్రికంగా జీవితం గడిపాను. మళ్ళీ పెళ్ళి చేసుకోమని బంధువులు, మిత్రులు సలహాలు

ఇచ్చినా, నా మనస్సు అంగీకరించలేదు. ఆయన స్థానం మరొకరికి ఇవ్వలేక పోయాను."

"మీ భర్త పేరు?"

"రాజశేఖర్."

"గుడ్. చెప్పండి."

"ఇన్నాళ్టికి నేను ప్రేమలో పడ్డాను."

రాగిణి కొంచెం సిగ్గుపడి తల వంచుకుంది.

"దేనికైనా టైమ్ రావాలంటారు. ఇదే అనుకుంటాను. అందులో తప్పేమీ లేదు మిసెస్ రాగిణీ."

"అది తప్పని నేనూ అనుకోవడం లేదు."

"అతను ఎవరు?"

"జార్జి వాలెస్. ప్రైవేట్‌గా పని చేస్తున్నాడు. క్లబ్‌లో పరిచయం. మా ఇద్దరికీ షటిల్ ఇష్టం."

"ప్రాబ్లమ్ ఏమిటి? అతనికి పెళ్ళయిందా?"

"నో ...."

"మీకంటే చిన్నవాడనా?"

"చిన్నవాడు కాదు. రెండేళ్ళు పెద్ద వాడే."

"ప్రాబ్లమ్ చెప్పండి. నేను వూహించలేకపోతున్నాను."

"ప్రాబ్లమ్ నా కొడుకు. వాడివల్ల నా జీవితం ఒక పజిల్‌లా తయారైంది."

"మీ సన్ పేరు?"

"రాజకుమార్. వెరీ ఇంటలిజెంట్. సైన్స్ చదువుతున్నాడు."

"అతను మీతో వుండడం జార్జికి ఇష్టంలేదా?"

"అలాంటిదేం లేదు. జార్జి చాలా మంచి వ్యక్తి. విషయం చెప్పాలంటే ఏం లేదు. కాని వాలా సున్నితమైనది. వాడికి బాగా వూహ వచ్చింది. తండ్రి పేరు తెలుసు. ఇప్పుడు నేను జార్జిని పెళ్ళి చేసుకుంటే వాడు భరించగలడా? తర్వాత వాడు ఎటువంటి ప్రాబ్లమ్స్ క్రియేట్ చేస్తాడోనని భయపడుతున్నాను."

రాగిణి సమస్య నాకు అర్థమైంది.

ఆమె భయం సమంజసమైనదే. ఆ వయస్సులో పిల్లలు తమ తండ్రిస్థానం మరొకరికివ్వలేరు. భరించలేని వ్యథలో ఆత్మహత్య చేసుకునే అవకాశం గూడా వుంది. సమాజం అటువంటి పిల్లల్ని సానుభూతి చూపించినట్లు నటిస్తూ రెచ్చగొడుతుంది.

"మీరు నాకు సరైన సలహా ఇవ్వాలి."

"తప్పకుండా. నాకు మీ అబ్బాయిని పరిచయం చెయ్యండి. అంకుల్ అని చెప్పండి చాలు. కుర్రవాడి మనస్థితిని బట్టి సలహా చెప్పగలను."

"థాంక్స్." చెప్పింది రాగిణి.

* * *

రాజకుమార్ చాలా తెలివైన కుర్రాడు. రాగిణి చెప్పినదాంట్లో అతిశయోక్తి ఏమీ లేదు. నన్ను వాళ్ళింటికి తీసికెళ్ళి అతనికి పరిచయం చేశాక నా గురించి ఎన్నో

విషయాలు తెలుసుకున్నాడు. నా మీద గురి ఏర్పడ్డానికి నేను పిల్లల పత్రికలలో వ్రాసిన కథలు అతనితో చదివించాను. నేనంటే అతనికి ప్రత్యేకమైన శ్రద్ధ కలిగింది. నన్ను 'అంకుల్' అంటూ ఎంతో ఆప్యాయంగా పలకరించేవాడు.

అలా నెలరోజులు గడిచాక రాగిణి పజిల్ సాల్వ్ చెయ్యగలనన్న నమ్మకం కలిగింది.

ఆ రోజు ఆదివారం.

రాజ్‌కుమార్‌ని జూకి తీసికెళ్ళాను. అంతా తిరిగి చూశాక తిరిగి వచ్చేటప్పుడు ఐస్ క్రీమ్ తింటూ పచ్చగడ్డిలో కూర్చున్నాము.

"రాజ్ నీకు మీ నాన్న అంటే ప్రేమ వుందా?"

అతని ముఖం నల్లబడింది తండ్రిని తలుచుకోగానే.

"ఆయన నా చిన్నప్పుడే పోయాడట అంకుల్. నేనెప్పుడూ చూశ్ళేదు. ఫొటో వుంది ఇంట్లో. అంతే."

"రాజ్. నీకు ఒక రహస్యం చెప్పాలనుకుంటున్నాను ఈ రోజు."

"రహస్యమా!"

"యస్."

"ఏమిటది?"

"చెప్తాను. కాని ఎవరికీ చెప్పకూడదు ప్రామిస్ చేస్తే చెప్తాను."

"ప్రామిస్ అంకుల్."

"మీ నాన్న చనిపోలేదు."

రాజ్‌కుమార్ ముఖం ఆశ్చర్యంతో నిండిపోయింది.

"అంకుల్. మీరు చెప్పేది నిజమేనా?"

"యస్."

రాజకుమార్ చాలాసేపు ఆశ్చర్యంలో వుండిపోయాడు. నేను చెప్పింది నమ్మలేనట్లు చూస్తున్నాడు.

"మరి మా ఇంట్లో ఫొటోలో వున్న నాన్న........?"

"ఆయన మీ నాన్న కాదు."

రాజకుమార్ అదిరిపడ్డాడు.

"జరిగిందంతా చెప్తాను. అర్థంచేసుకునే వయస్సు నీకుంది. అందుకే చెప్తున్నాను. కాని నీలోనే దాచుకో."

తల వూపాడు.

"జార్జివాలెస్ నీ అసలు తండ్రి. అతనూ మీ అమ్మ ప్రేమించుకున్నారు. నువ్వు గర్భంలో వద్దావు, కాని మీ అమ్మ తండ్రి బాదస్తుడు. జార్జి మన కులంకాదు, మతం కాదని పెళ్ళికి ఒప్పుకోలేదు. పెళ్ళికాకుండా పిల్లవాడిని కంటే చెడ్డపేరు వస్తుందని మీ అమ్మ ఆత్మహత్య చేసుకోవడానికి బావిలోకి దూకింది. అప్పుడు రాజశేఖర్ ఆమెను రక్షించాడు. మీ అమ్మ గౌరవం కాపాడడానికి ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. నిన్ను కనేవరకూ జాగ్రత్త కాపాడాడు. పెళ్ళి చేసుకున్నాడన్న మాటేగాని ఆమెను తన చెల్లెలిలా ఆదరించాడు. చాలా మంచివాడు. మంచి వాళ్ళకే త్వరగా చావు వస్తుందని పెద్దలు

అంటారే. అలాగే అతను నువ్వు పుట్ట గానే యాక్సిడెంట్‌లో చనిపోయాడు."

నేను చెప్పిన కథ రాజ్‌కుమార్‌ని ప్రభావితుణ్ణి చేసింది.

"మరి జార్జివాలెస్ ఏమయ్యాడు?"

"మీ అమ్మకు పెళ్ళి కాగానే ఎటో వెళ్ళిపోయాడు."

రాజకుమార్ ముఖంలో దిగులు కని పించింది. కొంతసేపు మౌనంగా వుండి పోయాడు.

"నీకు నీ అసలు నాన్నని చూడాలని వుందా?"

అతను తల వూపాడు.

సంతోషంతో అతని కళ్ళు మెరిశాయి. తండ్రిలేని కొరత ఆ కుర్రాడు ఎంతో అనుభవించాడు. సడెన్‌గా తండ్రి బ్రతికే వున్నాడని తెలియడం ఎంతో థ్రిల్లింగ్ వుంది.

"ఈ మధ్యనే జార్జి ఈ సిటీకి వచ్చాడు. మీ అమ్మమీద వున్న ప్రేమతో అతను ఇంతా పెళ్ళిచేసుకోలేదు. ఆయన పైలెట్. విమానాలు నడుపుతాడు."

"అంకుల్. నాకు మా నాన్నని చూపించవూ?"

"తప్పకుండా" అన్నాను.

తర్వాత రాజకుమార్‌ని ఎయిర్‌పోర్టుకి తీసుకెళ్ళి దూరంనుంచి జార్జివాలెస్‌ని చూపించాను.



రాజకుమార్ అతన్ని చూసి ఎంతో ఆనందించాడు. తన హృదయంలో అతనికి తండ్రి స్థానం ఇచ్చేశా

* * *

జార్జివాలెస్, రాగిణి పెళ్ళి చర్చిలో జరిగింది.

వాళ్ళిద్దరికంటే రాజకుమారే ఎక్కువ సంతోషంగా వుండడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది.

"మా పజిల్ మీరు మాత్రమే సాల్వ్ చేయగలిగారు. థాంక్యూ వెరీమచ్ సార్" అంది రాగిణి.

జార్జిగూడా నన్ను మెచ్చుకున్నాడు.

"నో థాంక్స్" అన్నాను నవ్వుతూ.